కథ

# ఈశ్వర వదనం

హిందీ మూలం: విష్ణు ప్రభాకర్
తెలుగు అనువాదం: జె. భాగ్యలక్ష్మి



చీకటి పడుతోంది. బండి ముందుకు సాగుతోంది. స్టేషన్‌లోని కాంతి వెనకబడుతోంది. మధ్య మధ్యలో పట్టాలు మారుతున్నప్పుడు ఖట్ ఖట్ చప్పుడు ఎక్కువవుతుంది. మళ్లీ మామూలే. సుధీర్ తన బెర్తుమీద పడుకొని నిద్రపోవటానికి ప్రయత్నిస్తున్నాడుకాని, నిద్ర వస్తే కదా?! ఇటూ, అటూ పొర్లుతూ రైలు చప్పుడు వింటున్నాడు. రైలు ముందుకు సాగుతోంది. అప్పుడే తనను పాత జ్ఞాపకాలు చుట్టుముట్టాయి. తుఫానులా తీవ్రంగా చెలరేగి మళ్లీ శాంతపడుతున్నాయి.

తను ఇంటినుండి బయలుదేరినప్పుడే తనను అందరూ హెచ్చరించారు. స్నేహితులు సరే సరి. ఇంటివాళ్లు కూడా..."సుధీర్! జాగ్రత్తగా వెళ్లు. ఇప్పుడిప్పుడే అక్కడ గొడవలు జరిగాయి. పైకి బాగున్నట్టున్నా లోలోపల పరిస్థితి మండిపోతోంది. ఎన్ని దుకాణాలు తగలబడ్డాయి! ఎంతమంది ప్రాణాలు పోయాయి! ఇటువంటి సమయాల్లో అన్నెం పున్నెం ఎరుగని వాళ్లే మరణిస్తుంటారు..."

సుధీర్ బుర్రలోకూడా ఈ ఆలోచనలే తిరుగుతున్నాయి. "ఎందుకవుతాయి ఈ అల్లర్లు? మతం పేరిట ఈ టెర్రరిజం ఎలా అందరినీ పొట్టన పెట్టుకుంటుంది? ఏదో ఒక నెపం వుండనే వుంటుంది. కాని చచ్చేది మనుషులూ, మానవత్వమూ, తనవారిని పోగొట్టుకున్న వారి గుండెల్లో బాధ, కళ్లనుండి నిరంతరం కారే కన్నీళ్లు...."

సుధీర్ తల విదిలించాడు. చుట్టూ చూశాడు. అందరూ నిద్రలో

ఉన్నారు. రైలు పట్టాలనుండి కర్కశధ్వని మాత్రం వినిపిస్తోంది. హఠాత్తుగా తనెక్కడికో దూరం వెళ్లిపోతున్న ట్లనిపించింది. అక్కడ అపూర్వమైన శాంతి, ప్రేమ ఉప్పొంగే పిలుపులు, కిలకిల నవ్వులు....

అతని మనసులో అటువంటి ఊహాచిత్రాలే కనిపించసాగాయి. చూస్తూ చూస్తూ ఎక్కడినుండి ఎక్కడికి వచ్చాడు.....అప్పుడు తను ప్రైమరీ స్కూల్లో చదువుతుండేవాడు. తన క్లాసులో హిందువులు, ముస్లింలు అందరూ ఉండేవారు. అందరూ క్లాస్‌మేట్సే. అల్లరి, తగాదాలు, పోట్లాటలు, ప్రేమలు అన్నీ వుండేవి. ఒకరిండ్లకు మరొకరు వచ్చి పోతుండేవారు.

సుధీర్‌ను ఒకసారిగా కుదిపినట్లయింది. బహుశా బండి పట్టాలు మార్చినట్లుంది. మళ్లీ తన ఆలోచనలలోకి వెళ్లిపోయాడు. అంటరానితన మంటూ అప్పుడప్పుడూ ఒక పెద్ద అగాధం ఏర్పడిన మాట నిజమే. కాని అది దాటటం తనకెప్పుడూ కష్టమనిపించలేదు. మనసులో కూడా ఏ కొరతా ఉండేది కాదు.

సుధీర్‌కు ఒక ముస్లిం స్నేహితుడు ఉండేవాడు. అప్పుడప్పుడు ఇంటికి వస్తూండేవాడు. అమ్మ అతనికి ప్రేమగా ఫలహారాలూ అవీ పెట్టేది. భోజనాలు చేయించేది. ఆ తర్వాత ఆ పాత్రలన్నీ నిప్పులో శుద్ధి చేసేది. సుధీర్‌కు హఠాత్తుగా ఎంతో ఆవేశం వచ్చింది. ఎందుకు, ఎందుకిలా జరుగుతుంది? అంటరానితనానికి అర్థమేమిటి? కాని తనను తాను అదుపులో పెట్టుకున్నాడు. తర్వాత గొణుక్కున్నాడు. ఇప్పుడు ఈ టెర్రరిజం మన మనసులో గొప్ప అగాధమై నిలిచింది. దీని నెవ్వటికైనా పూడ్చటానికి వీలుంటుందా? ఇప్పుడు మన శరీరం తెల్లగా ఉన్నా మనసు నల్లగా ఉంటుంది. కానీ ఆ రోజుల్లో శరీరం గురించి లేశమంత చింత కూడా ఉండేదికాదు. హృదయంలో మాత్రం తేడా ఉండేదా? ఒకరోజు తన క్లాస్‌మేట్ సయీద్ అమ్మతో అన్నాడు. "మా అక్క అంటుంది 'రోజా వాళ్లింటికి వెళ్లావు. అక్కడ అన్నం కూడా తింటావు. ఆ అబ్బాయిని ఒకసారి ఇంటికి పిలు' అని. అమ్మ నవ్వింది. "తీసుకుపో...ఎవరు వద్దన్నారు. కాని సాయంత్రానికి తిరిగి వచ్చేయ్యాలి."

అప్పుడు మేమిద్దరం వాళ్లింటికి వెళ్లాం. మమ్మల్ని చూసి ఇంట్లో ఆడవాళ్లంతా సంతోషించారు. నవ్వుతూ నవ్వుతూ ఎంతో అందంగా ఉన్నారు...బొద్దు బొద్దుగా పట్టువరువుల్లా.

వారిలో ఒకామె అడిగింది. "నీవేం తింటావు అబ్బాయి?"

"రొట్టె, పాలు." చెప్పాడు.

అప్పుడు సయీద్ వాళ్ల అమ్మ అంది, "సయీద్! ఈ అబ్బాయిని భోజనం చెయ్యమనవా?"

సయీద్ కొంచెం సందేహించాడు. "తనకు కూడా భోజనం వడ్డిస్తున్నావా అమ్మా?!"

వాళ్లక్క నవ్వింది. "ఈ అబ్బాయి మనింట్లో భోంచేస్తాడా?"

సయీద్ మళ్లీ సందేహించాడు. "ఎందుకలా అడుగుతున్నావు అక్కా. నేనుకూడా వీళ్లింట్లో..."

అక్క మధ్యలోనే ఆపింది. "వద్దు ...వద్దు. ఈ అబ్బాయి ఇక్కడ తినడు. వెళ్లి నాన్నను పిలుచుకురా." నేనిప్పటికీ ఆ మాటలు మరిచిపోలేదు. బజారునుండి మిఠాయి, పూరీలు ఒక హిందువు తెచ్చి మా ఎదుట పెట్టి వెళ్లాడు. మా దగ్గర కూర్చున్న సయీద్ అక్క అది చూపించి, "ఇక తినబ్బాయి. ఇది మీగడ లడ్డూ....మెత్తగా, తియ్యగా బాగుంటుంది" అంది.

సయీద్ తండ్రికూడా వచ్చాడు. ఆయన చాలా ప్రేమగా మాట్లాడాడు. మా ఆచార వ్యవహారాలకు ఏ మాత్రం భంగం కలగలేదు. పైగా వాటిని రక్షించాడు. అదెన్నటికీ తను మరువలేడు. పైగా ఎక్కడో హృదయంలో తాకుతుంది. ఈనాడుకూడా సయీద్ అక్క వచ్చి 'బాబూ! నేను నీ భోజనం తాకను కాని నువ్వు మా ఇంటికి రా. నేను నీతో కష్ట సుఖాలు మాట్లాడుకోవాలి. నేను కాల్చిన రొట్టెలు నువ్వు తినొద్దులే. కానీ నా పక్కన కూర్చుని నా బాధేమిటో తెలుసుకో'' అంటే ఎంత బాగుండేది! కళ్లల్లో నీళ్లు నిండుకొచ్చాయి.


ఒక్కసారిగా సుధీర్ ఉలిక్కిపడి లేచాడు. స్టేషన్ దగ్గరవుతున్నట్టుంది. తనిక్కడే దిగాలి. బండి ఆగింది. తన అటాచీ తీసుకొని ప్లాట్‌ఫారం మీదకు దిగి, త్వరగా స్టేషన్ బయటకు వచ్చాడు. ఏమీ జరగనట్టే ఉంది కాని, తన మనసులో ఎన్నో భావాలు. తను బయలుదేరినప్పటి హెచ్చరికలు వినిపించాయి. "సుధీర్! మనుషులు రాక్షసులై పోయారు. నువ్వు వెళ్తున్న చోట ఈద్ పండుగనాడు గొప్ప గలాటాలు జరగొచ్చు. జాగ్రత్తగా ఉండు." అప్పుడు సుధీర్ అన్నాడు--"ఈ భయంవల్లే ఇటువంటి కలహాలు వస్తాయి. నేను ఎవరితోనూ పోట్లాడటానికి పోవటంలేదు. ఒకరోజు ఉండి, పనిచూసుకుని మరునటి రోజు బయలుదేరి రావటమే..."

స్టేషన్ బయటకు వచ్చేసరికే బాగా వెలుగు వచ్చేసింది. జనాలంతా తమ తమ దారిన వెళ్తున్నారు. టాంగాలు, మోటార్లు, బస్సులూ అన్నీ రొద చేస్తున్నాయి. ఎక్కడో ఒకరు నవ్వటం, మరొకరు చిరునవ్వుతో ముందుకు సాగటం. ఇక్కడ గొడవలు జరుగుతాయని గాని,

## ఐశ్వర్య మీద అలిగాట్ట!

'దేవ్‌దాస్' చిత్రంలో హీరోగా ఐశ్వర్య చేసిందని అందరికీ తెలుసు. ఆ చిత్రం విడుదలకు ముందు షారూఖ్, ఐశ్‌ను తీసుకోమని అందరికీ రికమెండ్ చేశాట్ట. దానికి విదేశాల్లో డబ్బు బాగానే గిట్టింది. కానీ ఎందుకనో షారూఖ్, అటు పైన మారిపోయాట్ట. అందుక్కారణం సల్మాన్‌ఖాన్ అడ్డగోలు వ్యవహారం కావచ్చు. తన సొంత బానర్ మీద తీస్తున్న చిత్రంలో నుంచీ ఐశ్‌ను తొలగించాట్ట. అంతే కాక, కరన్ జోహార్ తీస్తున్న చిత్రంలో తనను నటించమని అడిగితే, ముందొప్పుకుని, తరువాత ఐశ్వర్య హీరోయినైతే తను చెయ్యనని కచ్చితంగా చెప్పేశాట్ట. షారూఖ్. ఓ సారి షారూఖ్‌ను కొట్టినంత పని చేశాడు సల్మానని అందరికీ తెలిసిందే కదా! ముందు జాగ్రత్త కోసమేమైన్నా ఇట్లా చేస్తున్నాడంటారా?

ఎస్.



ఏమైనా అల్లర్లు అవుతాయని గాని ఊహించేది కష్టం.

కొంచెం ముందుకు వెళ్లి సుధీర్ టాంగాను పిలిచాడు. టాంగావాడు డబ్బు ఎక్కు వడిగాడు. బేరం కుదరలేదు. రెండవ టాంగా వాడుకూడా వచ్చినంత స్పీడుగా వెళ్లిపోయాడు. మూడో టాంగాకూడా కుదరలేదు.

సుధీర్ ఇక్కడికి తరచూ వస్తూ ఉంటాడు. ఇక్కడ టాంగా వాళ్లకుకూడా తాను గుర్తే. అందుకే ఒక టాంగావాడు వచ్చి, "ఎక్కడికి బాబూ" అని అడిగాడు.

"వహాడీ టోలా."

"రండి కూర్చోండి."

"డబ్బు సంగతి చెప్పు. ఎంత తీసుకొంటావు?"

"మీరెంతిస్తే అంతే తీసుకుంటాను."

"అర్ధరూపాయి ఇస్తాను సరేనా?"

"అర్ధరూపాయి చాలా తక్కువ బాబూ. సరేలేండి. రండి. మీరు కూర్చోండి."

గుర్రం బాగా బలంగా ఉంది. వేగంగా పరుగెత్తుతోంది. ఒక్కొక్క వీధీ దాటుకుంటూ వెళ్తున్నారు. ఎన్నో కార్లు, బస్సులు, స్కూటర్లు టాంగాను దాటివెళ్తున్నాయి. మార్కెట్ దాటారు. సినిమా హాస్, బ్యాంక్ బిల్డింగ్, కంపెనీబాగ్ కూడా దాటారు.

టాంగావాడు దారి మరిచిపోయాడా అని సుధీర్‌కు అనుమానం వచ్చింది. "ఎక్కడికి తీసుకువెళ్తున్నావు భాయీ" అని అడిగాడు.

"వహాడీ టోలా."

"కానీ అది ఇటు లేదే!"

టాంగావాడు బదులిచ్చాడు. "కాదండి. ఈ దారికూడా అక్కడికి వెళ్తుంది. ఆ ఎదురుగా ఉన్న రోడ్డు దాటితే ఢిల్లీ గేటు, ఆ తర్వాత వచ్చేదే వహాడీ టోలా."

సుధీర్ ఊరుకున్నాడు. కాని ఈ దారి చాలా దూరమనిపిస్తోంది. అక్కడక్కడా చిన్న చిన్న దుకాణాలు...అన్నీ ముస్లింలవే.

దారంతా మురికి మురికిగా ఉంది. వాసన భయంకరంగా ఉంది.

"మనం ఎక్కడున్నాం?" సుధీర్ అడిగాడు.

టాంగావాలా నవ్వాడు. "ముందర మలుపు తిరిగితే రోడ్డు బాగుంటుంది బాబూ."

మలుపు వచ్చింది కాని, వెడల్పయిన రోడ్డేదీ రాలేదు. సన్నటి గొంది ఎదురుగా కనిపిస్తోంది. దాని తర్వాత మసీదు. అక్కడ టాంగా ఆపి, "మీరు ఇక్కడే కూర్చుని ఉండండి, బాబూ! నా లాంతరు బాగు చెయ్యటాని కిచ్చాను. రెండు నిమిషాల్లో వస్తాను. లేకపోతే చీకటిపడ్డాక పోలీసులు గొడవ చేస్తారు. మా ఇల్లుకూడా ఇక్కడే" అన్నాడు టాంగావాలా.

సుధీర్ సందేహిస్తూ అడిగాడు. "మనం ఎక్కడున్నాం....నే నింతకుముందు ఎప్పుడూ ఇక్కడికి రాలేదు."

"పట్టణం పెద్దదికదా, బాబూ, మీరెక్క డెక్కడని చూస్తారు? క్షమించండి. ఒక్క క్షణంలో వచ్చేస్తాను" అంటూ వెళ్లిపోయాడు.

సుధీర్ ఆ సన్నటి గొందివైపే చూస్తూ కూర్చున్నాడు. చుట్టూ చాలా నిశ్శబ్దంగా ఉంది. అప్పుడప్పుడు దగ్గరలో ఉన్న ఇండ్లనుండి కొద్ది కొద్దిగా శబ్దాలు వస్తున్నాయి. మలుపువద్ద దుకాణంలో ఒక దుకాణాదారు కూర్చొని ఉన్నాడు. అతను ముస్లిం. దుకాణంలో పాన్, బీడీ, ఆలూ, వేయించిన శనగలు, మరెన్ని వస్తువులో భగవంతునికే ఎరుక....అవన్నీ అక్కడున్నాయి.

సుధీర్ ఎదురు చూస్తున్నాడు. అయిదు, పది, పదిహేను, ఇరవై నిమిషాలు గడిచాయి. ఇరవై అయిదు నిమిషాలు. టాంగావాడు వత్తాలేదు. సుధీర్ ఆ షాపతనిని పిలిచి, 'భాయీ! ఇక్కడ టాంగావాలా ఇల్లెక్కడ?' అని అడిగాడు. దుకాణం వ్యక్తి ఏదో చెప్పబోయాడు. ఇంతలో నలుగురైదుగురు ముస్లిం యువకులు సుధీర్ వద్దకు వచ్చి, "కిందకు దిగు" అన్నారు.

ఆ క్షణంలో సుధీర్ గుండె దడదడలాడింది. సందేహిస్తూ, "మీరెవరు?" అన్నాడు.

అందరికంటే ముందున్న పొడవైన యువకుడు వగలబడి నవ్వాడు. "మేమెవరమో తర్వాత చెపుతాం. ముందు దిగు."

సుధీర్‌లో తుఫాన్ చెలరేగుతోంది. అయినా గంభీరంగా "నేను దిగకపోతే...." అన్నాడు.

"మేం దింపుతాం."

"అయితే దింపండి." అలాగే కూర్చొని రెండు చేతులూ కోటు జేబుల్లో పెట్టుకున్నాడు సుధీర్. లోపలి అందోళన వ్యక్తం చేయలేదు.

"భలే ధైర్యస్థుడిలా ఉన్నావు. కాని ఈ సమయంలో ఎక్కడున్నావో తెలుసా?"

"నాకు తెలీదు. మీరు చెప్పండి." అన్నాడు సుధీర్

"ఇది ఇస్లాంపురా. ఇక్కడికి వచ్చిన వాళ్లెవరూ తిరిగి వెళ్లరు. అందుకే నోరు మూసుకొని కిందకు దిగు."

సుధీర్ కళ్లముందు చీకటి కమ్మింది. గుండె తీవ్రంగా కొట్టుకుంటోంది. చుట్టూ చూశాడు. దుకాణంలో వ్యక్తి బొమ్మలా కూర్చుని ఉన్నాడు. చుట్టుప్రక్కల ఇండ్లలో ఏ శబ్దమూ లేదు. హఠాత్తుగా ఎవరో మెల్లగా మాట్లాడుతున్న ట్లనిపించింది. రెండు నిమిషాలలో ఒక వ్యక్తి ఇవతలకి వచ్చి "ఏమయింది భాయీ" అని అడిగాడు.


పొడవాటి వ్యక్తి అన్నాడు. "రేపు ఈద్ కదా. పొట్లాట తప్పదు. అందుకే టాంగావాలా మజీద్ ఒక కాఫిర్‌ను పట్టుకొచ్చాడు."

కొత్త వ్యక్తి ఈ మాటవిని సుధీర్ దగ్గరకు వచ్చాడు. ఆశ్చర్యపోయినట్లు, "అరే, నువ్వు... నువ్వు..."

"ఎవరతను?"పొడవుపాటి అతను అడిగాడు.

సుధీర్‌కు ఏమీ అర్థం కాలేదు. తలమాత్రం గిర్రున తిరుగుతోంది. అదృష్టవశాత్తూ తను టాంగాలో కూర్చొని ఉన్నాడు కాబట్టే సరిపోయింది. టాంగాను గట్టిగా పట్టుకున్నాడు.

కొత్తగా వచ్చిన వ్యక్తి ఒకసారి ఇటుచూసి, నవ్వుతూ వెనక్కి తిరిగి ఆ యువకులతో



అన్నాడు. "కనిపించటం లేదా....ఇతను ముసల్మాను. ఈద్ రోజు ముసల్మానుపై అఘాయిత్యం చేస్తారా?"

సుధీర్ వైపు తిరిగి "నువ్వు కోర్టులో పని చేస్తావు కదా. నువ్వు అక్బర్ కాదూ?" అన్నాడు.

సుధీర్‌కు ఆకాశంనుండి కిందకు పడినట్లయింది. ఏదో కలగంటున్నట్టుంది. ఎలా అన్నాడో తెలీదు. "అవును. నేను అక్బరునే. కోర్టులో పని చేస్తున్నాను."

వాళ్లందరూ ఒకరి మొహాలు ఒకరు చూసుకొంటూ వెనక్కి వెళ్లారు. పొడవైన యువకుడు కోపంగా, "మజీద్‌కు కళ్లు గుడ్డి. మన మనిషిని కూడా గుర్తించలేదు అన్నాడు. సుధీర్ వైపు తిరిగి వినయంగా "క్షమించు, బ్రదర్, మా కళ్లు మూసుకుపోయాయి. మీ రెక్కడికి వెళ్లాలి?"

సుధీర్‌కు తిరిగి ప్రాణం వచ్చినట్లయింది. యాంత్రికంగా "పహాడీ టోలా" అన్నాడు.

కొత్తవ్యక్తి "అబీద్ హుసేన్ ఇంటికా?" అన్నాడు.

సుధీర్‌కు "అవును" అని జవాబివ్వవలసి వచ్చింది.

కొత్తవ్యక్తి టాంగా ఎక్కి కూర్చొని "చాలా దూరం....విడిచిపెట్టి వస్తాను. నేను సమయానికి రాకపోతే మీరెంత పాపం చేసేవారో....తోబా తోబా..."

టాంగా ముందుకు సాగింది. సుధీర్ శరీరం కంపిస్తోంది. కాని ఢిల్లీ గేటుకు ఇవతలికి రాగానే నవ్వు రాసాగింది. కొత్తగా వచ్చిన వ్యక్తిని "నా ప్రాణం ఎందుకు కాపాడారు?" అని అడిగాడు.

ఆ వ్యక్తి పెద్దగా నవ్వాడు. "మన్నించండి, బ్రదర్, మీ అసలు పేరేమిటి?"

"సుధీర్ కమార్. నేను ఇండోర్‌లో వుంటాను".

కొత్త వ్యక్తి అన్నాడు: "నా పేరు లతీఫ్ హుసేన్. ఇక్కడ ఒక కోర్టులో పనిచేస్తున్నాను. మీకిదంతా వింతనిపించి ఉంటుంది...నిజంగా వింతే మరి."

సుధీర్ అన్నాడు. "ఈ కొన్ని క్షణాలలో నేనెన్ని జన్మలెత్తానో చెప్పలేను. మీ మేలు ఎన్నటికీ మరువలేను."

లతీఫ్ అన్నాడు. "సుధీర్ సాహెబ్! నేను మేలు చేసిందేమీ లేదు."

సుధీర్ ఆశ్చర్యపోతూ, "మరెవరు చేశారు?" అని అడిగాడు.

టాంగా రోడ్డు దాటి పహాడీ టోల్ లేన్‌లోకి వచ్చింది. బస్తీ కనిపిస్తోంది. లతీఫ్ టాంగా ఆపి "ఇక మీరు వెళ్లవచ్చు" అన్నాడు.

"ఎవరు నా ప్రాణం రక్షించారో మీరు చెప్పనే లేదు" అన్నాడు సుధీర్.

"సుధీర్‌బాబూ! తెలుసుకొని ఏం లాభం?"

"జ్ఞాపకం పెట్టుకుంటాను. ఈ ప్రపంచంలో ఒక హృదయముంది. ఆ హృదయానికి బాధ తెలుసు. ఇంకా..."

"ఇంకా ఏమిటి?" లతీఫ్ అడిగాడు.

సుధీర్ కంఠం నిండుకొచ్చింది గాద్గదికంగా. "ఇంకేమీ లేదు, లతీఫ్‌బాయ్, నిజంగానే తెలుసుకొని ఏం చేస్తాను? మనిషికి మానవత్వం తెలిసిన తర్వాత ఇక తెలుసుకోవలసింది ఏముంటుంది?" సుధీర్ టాంగా దిగాడు. జేబునుండి యాభైరూపాయలు తీసి అతనికిస్తూ "కొన్ని రూపాయలిచ్చి మిమ్మల్ని అవమానపరచ దలుచుకోలేదు. నా తరఫునుండి ఈ డబ్బు ఎవరికైనా బీదవాళ్ల కివ్వండి. నేను ఋణపడి ఉంటాను."

లతీఫ్ ఒక క్షణం ఆగి అన్నాడు. "సుధీర్ బాబూ, వినండి. అంతా చెబుతాను. నేను




ముసల్మానును. ఖురాన్‌ను ఎంతో భక్తి గౌరవాలతో చదువుతాను. అందులోని ప్రతి అక్షరమూ నాకు ఖుదా ఆదేశమే. ఆ ఖురాన్‌లో నేను చదివాను 'మంచిదారి' గురించి. చాలా సార్లు చదివాను. ఇతరులకు వివరించాను. ఈ రోజు వాళ్లు మిమ్మల్ని పట్టుకొని వచ్చినప్పుడు నా మనసులో ఒక ప్రశ్న లేచింది. ఇది సరైన మార్గమా? నిజంగా ఖుదాకు ఇదే సమ్మతమా? తన వారిని చంపి మా చేతులు రక్తసిక్తం చేసుకోవాలా? మీకు నిజం చెపుతున్నాను. నేను ఏ నిర్ణయానికీ రాలేకపోయాను. ఇంతలో జబ్బుతో ఉన్న నా కూతురు నా దగ్గరకి వచ్చింది. 'అబ్బా! నిన్న మీరు మంచిమార్గం గురించి చెపుతున్నారుకదా. మోసం చేసి తెచ్చిన ఒక మనిషిని. రక్షించడం మంచి మార్గం కాధా' అని అడిగింది.

అది విని నేను తటాపటాయించాను. నా కూతురివైపు చూశాను. తన కళ్లల్లో నీళ్లొస్తున్నాయి. మొహం మెరుస్తోంది. నన్ను అడగటానికికాక ఆజ్ఞాపించటానికి వచ్చినట్టుంది. 'అబ్బా! మంచిదారిలో ముందుకు సాగాలంటే కష్టంలోనున్న ఆ వ్యక్తిని కాపాడండి."

నాకు ఇది ఆజ్ఞ. అక్కడ ఒక్క క్షణం ఉండలేకపోయాను. కిందకు వచ్చాను. ఆ తర్వాత ఏం జరిగిందో మీకు తెలుసు. కానీ, సుధీర్‌బాబూ, ఇదంతా ఇంత సులభంగా ఎలా జరిగిందన్నది నాకు ఆశ్చర్యంగానే ఉంది. పోనివ్వండి. మీ రికవెళ్లవచ్చు. నేనూ వెళ్తాను. నా కూతురికి అసలే ఒంట్లో బాగలేదు. చూసేవాళ్లు కూడా లేరు."

ఈమాత్రం చెప్పి లతీఫ్ గుర్రాన్ని అదిలించాడు. గుర్రం ఒక్కసారిగా పరుగందుకొంది.

సుధీర్ ఉలిక్కిపడి "లతీఫ్ భాయీ, వినండి, ఒక్కమాట" అన్నాడు. లతీఫ్‌భాయి అప్పటికే దూరంగా వెళ్లిపోయాడు. సుధీర్ అతనివెంట వెళ్లే సాహసం చెయ్యలేకపోయాడు. ఆ అమ్మాయిని తలుచుకొంటూ పహాడీ టోల్ వైపు తిరిగాడు. కళ్లముందు జబ్బుతో ఉన్న ఆ అమ్మాయి ముఖం తేజస్సుతో కనిపిస్తోంది. ఈశ్వరుడికి ఒక ముఖమంటూ ఉంటే అది ఆ అమ్మాయి ముఖమే అయి వుండాలి, అనుకున్నాడు. ■